క్లుప్తంగా


చురుగ్గా సర్వే



జీవీఎంసీ 12వ వార్డు లీలాసుందరినగర్‌లో ఓ వ్యక్తికి బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆరిలోవ: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డుల్లో చురుగ్గా సాగుతోంది. ఎఫ్‌ఆర్‌యూలు, యూపీహెచ్‌సీల పరిధిలో నర్సింగ్ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. రక్తం, బీపీ, మధుమేహం, జ్వరం తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం 12వ వార్డు లీలాసుందరినగర్‌లో సర్వే నిర్వహించారు.

పర్యావరణ విద్యపై పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఆరిలోవ: పర్యావరణ విద్యపై ఏయూ ఆచార్యుడు డాక్టర్ టి.షారోన్‌రాజు రచించిన పుస్తకాన్ని వర్సిటీలో గురువారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. పర్యావరణ పర్యరక్షణ కోసం అంకిత భావంతో ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రచయితను అభినందించారు.

మహిళా కళాశాలకు 8 కంప్యూటర్ల అందజేత



కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న వాసవీ విద్యా విరాళ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : వాసవీ క్లబ్ విద్యా విరాళ పథకంలో భాగంగా 8 డెస్కటాప్ కంప్యూటర్లను విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి వాసవీ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పి. గాయత్రి, వైజాగ్ వాసవీక్లబ్ ప్రెసిడెంట్ సతీష్, వాసవీ విద్యా విరాళం అధ్యక్షుడు దీపక్, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, డాక్టర్ గీతాంజలి, వాసవీ క్లబ్ సభ్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో గురువారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజాస్వామి మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 24 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం దుర్గాహోమం, మహాలక్ష్మిదుర్గమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, దేవీ నవరాత్రుల్లో ప్రతి రోజు అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు వేంకటేశ్వరస్వామికి తిరువీధి, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుం చెల్లించి రసీదు పొందాలని రాజాస్వామి కోరారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్

- వచ్చేనెల 3 నుంచి 21వ తేదీ వరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు
- జోన్–3 పరిధిలో 7 చోట్ల ఏర్పాటు

ఎంవీపీ కాలనీ: ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇప్పటికే నగరంలో యూపీహెచ్‌సీల ఏర్పాటుతో పాటు ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యాన్ని ప్రజల ముంగిటకు చేర్చిన వైఎస్ జగన్ సర్కారు.. తాజాగా ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆర్యోగ సురక్ష శిబిరాల నిర్వహణ సన్నద్ధమైంది. ఈ మేరకు జీవీఎంసీ జోన్–3 అధికారులు ప్రత్యేక శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్యాంపుల నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల మొదటి వారంలో ప్రారంభమైన ఈ సర్వే ద్వారా ఆశా వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటున్నారు. ఈ నెలాఖరు నాటికి ఈ సర్వే పూర్తి కానుంది. వచ్చే నెల 1వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ నెలాఖరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్యాంపులు జరగనుండగా.. విశాఖ జోన్–3 పరిధిలో 3వ తేదీన ప్రారంభమై 21వ తేదీ వరకు వివిధ వార్డుల్లో కొనసాగనున్నాయి. స్థానిక పీహెచ్‌సీల వైద్యుడితో పాటు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉండనున్నారు.



విస్తృతంగా జరుగుతున్న ఇంటింటి ఆరోగ్య సర్వే

శిబిరాలు ఎక్కడెక్కడ?

జగనన్న ఆర్యోగ సురక్ష ద్వారా జోన్–3 పరిధిలో 8 క్యాంపుల ద్వారా వైద్య సేవలు అందించనున్నారు. వచ్చేనె 3 నుంచి 21వ తేదీ వరకు వివిధ వార్డుల్లో జరగనున్న ఆరోగ్య శిబిరాల వివరాలిలా ఉన్నాయి.

- 3న ఇసుకతోటలో యూపీహెచ్‌సీలో
- 6న విద్యుత్‌నగర్ ఎన్‌జీవో కాలనీలో
- 12న పాత వెంకోజిపాలెం(మద్దిలపాలెం పీహెచ్‌సీ)లో
- 13న లాసన్స్‌బే కాలనీ పీహెచ్‌సీలో
- 16న చినవాల్తేర్‌లోని విద్యానగర్ కాలనీ పీహెచ్‌సీలో
- 18న పాత రేసపువానిపాలెం(స్వర్ణభారతి) పీహెచ్‌సీలో
- 21న దొండపర్తి పీహెచ్‌సీలో ఈ క్యాంపులు జరగనున్నాయి.

పకడ్బందీగా ఏర్పాట్లు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఇంటింటి సర్వే వేగవంతంగా జరుగుతోంది. సర్వే ద్వారా సేకరించిన వివరాల ప్రకారం ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించనున్నాం. వైద్య చికిత్సలు అనంతరం ఉచితంగా మందులు అందిస్తాం. ఈ క్యాంపులో స్పెషలిస్ట్ వైద్యులు సైతం అందుబాటులో ఉండనున్నారు. జోన్–3 పరిధిలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేష్, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–3

జాలరిపేటలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఎంవీపీ కాలనీ: జాలరిపేటలో బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. గురువారం జాలరిపేటలో పర్యటించిన ఆయన రోడ్ల నిర్మాణంపై స్థానికుల విజ్ఞప్తి మేరకు పరిశీలన చేశారు. అనంతరం ఇంజినీరింగ్ విభాగం అధికారులను పిలిపించి రోడ్ల నిర్మాణంపై వివరాలు సేకరించారు. తక్షణం ఆయా రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేయాలని సూచించారు. గతంలో జాలరిపేట వ్యాప్తంగా సీసీ రోడ్లు నిర్మాణం జరగ్గా, ఆదర్శ గ్రామం పేరిట టిడ్కో గృహ సముదాయం పనుల కారణంగా ప్రధాన రహదారి నిర్మాణం జరగలేదని ఈ సందర్భంగా అధికారులు ఎంపీకి తెలియజేశారు. తక్షణమే ప్రతిపాదనలు పంపి రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



జాలరిపేటలో రోడ్లను పరిశీలిస్తున్న ఎంపీ ఎంవీవీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలం వద్ద ట్రాఫిక్ పోలీసులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బీఆర్‌టీఎస్ రోడ్డులో అడవివరం నుంచి ఓ పాల వ్యాను హనుమంతవాక వైపు వెళ్తు దారపాలెం వద్ద రోడ్డు పక్కన ఆగింది. ఆ వ్యాను నుంచి డోర్ తెరుచుకుని డ్రైవర్ కిందకు దిగుతుండగా అదే సమయంలో వెనక నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొంది. అంతటితో ఆగకుండా దాని ముందు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని కూడా బలంగా ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న యువకుడి తలకు తీవ్రగాయమైంది. వ్యాన్ డ్రైవర్‌కు కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ కానిస్టేబుళ్లతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కారు డ్రైవర్ కారును రోడ్డుపై విడిచిపెట్టి పరారయ్యాడు. పోలీసులు క్షతగాత్రులను హెల్త్‌సిటీలో ఆస్పత్రికి తరలించారు. రోడ్డు మీద ఉన్న కారును క్రేన్‌తో పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి






బీచ్ రోడ్డులో గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, తదితరులు

బీచ్ రోడ్డు: కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా గురువారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మేయర్ గొలగాని హరివెంకటకుమారి కూడా జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా కళా పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

అల్లిపురం : సత్య సుమధుర స్వరాలు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన తెలుగు, హిందీ సినీ గీతాల సంగీత విభావరి అలరించింది. చాంద్ మేరా దిల్ మెగా మ్యూజికల్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన గాయని సత్యవతి, పీబీ ఖాన్, కిరణ్ కుమార్ నిర్వహణలో సమీర్, భాగ్యలక్ష్మి, కీర్తి, లావణ్య, రమేష్ పట్నాయక్, సబీనా, సబిహా, కల్యాణ్, రవీంద్ర తదితరులు హుషారైన తెలుగు, హిందీ గీతాలు ఆలపించి ప్రేక్షకులను మైమరిపించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, ప్రముఖ వ్యాఖ్యాత రాజేంద్రప్రసాద్, విశాఖ గాయనీ గాయక సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్, కార్యదర్శి డి.భూపతిరావు తదితర కార్యవర్గం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథులుగా కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ సతీష్‌కుమార్, రవీంద్ర, రవి కిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

వీనుల విందుగా అన్నమయ్య సంకీర్తనామృతం

సీతంపేట: శారదా స్వర సంగమం, అన్నమయ్య స్వర అకాడమీ సంయుక్తంగా గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనామృతం ప్రేక్షకులను అలరించింది. గాయకులు, లెఫ్టినెంట్ లోకేష్ పర్యవేక్షణలో సుజన, ఉమాదేవిలు వారి శిష్య బృందంతో కలిసి అన్నమయ్య మధుర గీతాలను ఆలపించారు. లోకేశ్ పాడిన కలగంటి కలగంటి , బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, గోవింద గోవింద కీర్తనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో గాయనీ గాయకులను ఎస్.విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, శారద, ఎం.ఎస్.మాధవ్ ప్రోత్సహించారు.

విశాఖ బాలుడికి ప్రిన్స్ ఆఫ్ ఏషియా అవార్డు



ప్రిన్స్ ఆఫ్ ఏషియా అవార్డు తీసుకుంటున్న అయాన్ష్ జోషి

మద్దిలపాలెం: సీతమ్మధారకు చెందిన నాలుగేళ్ల బాలుడు అయాన్ష్ జోషి జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పోటీలలో ప్రిన్స్ ఆఫ్ ఏషియా అవార్డుతో మెరిశాడు. బ్యాంకాక్ వేదికగా ఫ్యాషన్ రన్‌వే ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ ఈ పోటీలు జరిగాయి. పలు దేశాల నుంచి 50 మంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. వారిలో విశాఖకు చెందిన అయాన్ష్ భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించి, అత్యుత్తమ బిరుదు ప్రిన్స్ ఆఫ్ ఏషియా కైవసం చేసుకున్నాడు. బాలుడు తల్లిదండ్రులు అరవింద్ జోషి, జరీనా ప్రముఖ వ్యాపారవేతలు. అయాన్ష్ అవార్డు సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా సహస్ర తులసి పూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వృద్ధుడి మృతి

ఆరిలోవ: ఆరిలోవలో ఓ వృద్ధుడు మద్యం మత్తులో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాలాజీనగర్‌కు చెందిన వై.అప్పారావు(62) మద్యానికి బానిసయ్యాడు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎప్పటిలాగే పూటుగా మద్యం సేవించాడు. మోతాదు ఎక్కువ కావడంతో అప్పారావు మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే సహించం



959వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించనివ్వబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 959వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీస్, అడ్మిన్, టౌన్‌షిప్ అడ్మిన్ విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసంతర్పణలు



పార్వతీనగర్‌లో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న మేయర్ హరివెంకటకుమారి



మద్దిలపాలెంలో అన్నదానం చేస్తున్న అక్కరమాని వెంకటరావు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో వాడవాడలా అన్నసంతర్పణలు జరుగుతున్నాయి. గురువారం జీవీఎంసీ 9, 11, 12, 13 వార్డుల్లో పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. 11వ వార్డు పార్వతీనగర్‌లో గణేష్ విత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని భక్తులకు వడ్డించారు. ముందుగా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. 12, 13 వార్డుల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన అన్నసమారాధనల్లో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఆయా వార్డుల కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, స్థానిక నాయకులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో జరిగిన అన్నసంతర్పణలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో ఫ్రెండ్స్ లిటిల్ బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో గోకుల్ యంగ్‌బాయ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ పీతల గోవింద్ ప్రారంభించారు. రాజీవ్‌నగర్‌లో అన్నసంతర్పణ కోసం 8 బస్తాల బియ్యం, పీతలవానిపాలెంలో అన్నదానానికి 20 బస్తాల బియ్యాన్ని ఎంపీ, ఎంవీవీ సత్యనారాయణ అందజేశారు.



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్

భక్తిశ్రద్ధలతో మిలాద్–ఉన్–నబీ

బీచ్ రోడ్డు: మహ్మద్ ప్రవక్త (రసూలల్లా సల్లాల్లాహీ అలైహి వసల్లం) జన్మదినమైన మిలాద్–ఉన్–నబీ వేడుకలను చినవాల్తేరు మొహమ్మదీయ మసీద్ యూత్ ప్రెసిడెంట్ ఎస్.కె.ఖాదర్ బాబా ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మసీదు నుంచి నిర్వహించిన భారీ శాంతి ర్యాలీ పాత నగరంలోని హజ్రత్ ఇషాక్ మదినీ ఔలియా దర్గా వరకు సాగింది. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాతెహ జరిగింది. అన్నసమారాధన నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ, కార్పొరేటర్ బర్కత్ ఆలీ, మొహమ్మదీయ మసీదు యూత్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ముగిసిన పవిత్రోత్సవాలు

సింహాచలం : సింహగిరిపై ఐదు రోజులుగా జరిగిన పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపును పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం ఏకాంత స్నపనాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. గంగధార జలాలు, పంచామృతాభిషేకాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి



మద్దిలపాలెంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



భగత్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ సభ్యులు

ఆరిలోవ: డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆరిలోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో జీవీఎంసీ కుక్కల ఆపరేషన్ కేంద్రం వద్ద గురువారం భగత్‌సింగ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువజన సంఘం కృషి చేస్తుందన్నారు. యుక్త వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు డీవైఎఫ్‌ఐ సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మద్దిలపాలెంలో ఆయన చిత్ర పటానికి ఏఐవైఎఫ్ నాయకులు రవి, పడాల గోవింగ్, మధురెడ్డి, అశోక్, తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

చిత్రకళా పోటీలకు విశేష స్పందన

దాబాగార్డెన్స్ : చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ అఖిలభారత చిల్డ్రన్ ఆర్ట్ పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రేమసమాజం మినీ హాల్ వేదికగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన చిత్రకళా పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీశారు. ఈ సందర్భంగా చోడవరం చిత్రకళా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి బొడ్డేటి సూర్యనారాయణ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా చిత్రకళా పోటీలు నిర్వహిస్తూ ఎంతో మంది చిత్రకారులను సమాజానికి పరిచయం చేశామన్నారు. ఏడాదికోసారి ఇటువంటి పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, సమాజానికి చిత్రకారులను అందిస్తున్నట్లు తెలిపారు. తన వద్ద శిక్షణ పొందిన అనేక మంది చిత్రకారులుగా.. డ్రాయింగ్ టీచర్లుగా రాణిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచి ఎంట్రీలు వచ్చాయన్నారు. పిల్లలకు నచ్చిన అంశాన్నే ఎంచుకుని డ్రాయింగ్ వేయించామన్నారు. పోటీల విజేతలకు నవంబర్ 4న చోడవరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.



చిత్రకళా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మూడు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద మూడు కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈమేరకు గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్నట్లు స్పష్టమైన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వేచి ఉన్నారు. వారిని చూసి తప్పించుకునే యత్నంలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. బెంగుళూరుకు చెందిన దీప్ దర్శన్, శివలింగ ప్రసన్, అరకు ప్రాంతానికి చెందిన వంతల గిన్నులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 3 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. వారు కేసు దర్యాప్తు చేపట్టారు.